
కథ

# లావ్‌లో లవ్!




ముక్కంటి ఇంటిలో పెంపుడు పనివాడు దండధరం. ముక్కంటికి ఇష్టమైనవాడు.

''వద్దు రావద్దు నీకసలు పనే చెప్పను, ఒకవేళ బుద్ధి తక్కువై నీకు పనంటూ చెబితే ఆ పని అయిందాక నీ వెంటే వుంటాను, సరేనా'' విసుక్కున్నాడు ముక్కంటి.

''ఇంకేదన్నా కొత్తరకంగా అరవండయ్యా'' అన్నాడు దండధరం.

ముక్కంటికి ఆలోచన పోయి- ఏమి తోచక తన తలమీదే లయవిన్యాసం చేసుకున్నాడు.

''ఏమిటండీ ఇది, వాణ్నేమనలేక మీ తల పగలగొట్టుకుంటారు'' అంటూ వచ్చింది ముక్కంటి భార్య హిమసుతం.

భార్య ఆంతర్యం అర్థమయింది ముక్కంటికి. దండధరాన్ని బయటికి పంపించే సరైన అవకాశం కోసం కాచుక్కూచున్నదని తెలుసు. ''వాడు నా దగ్గరకాక ఇంకెక్కడా బతుకలేడు. వాణ్ని ఇక్కడ లేకుండా చేయడమంటే ఎక్కడా లేకుండా చేయడమే. అదొదిలేసి ఇంకేదన్నా చెప్పు'' అన్నాడు భార్యతో. ''గోల్కొండకి టికెట్లు తేరా అంటే గోల్కొండకోట చూడ్డానికి టికెట్లు తెచ్చాడు మొన్న. లింగాన్ని పిలుచుకురారా అంటే పీక్కురారా అని వినపడిందన్నాడు నిన్న. రోజూ వాడలా మిమ్మల్ని చంపుకు తినడం నేను చూడలేకపోతున్నాను'' అంది హిమసుతం.

''తినడానికి నీకేం మిగల్చడం లేదనా'' నవ్వుతూ అన్నాడు ముక్కంటి. ''పొరపాటయింది గాని లెండి అసలు నేనొచ్చింది దేనికంటే- మీకు వీలుగాకపోతే మా నాన్నే ఎలాగోలా వచ్చేవాడు. వాణ్నెందుకు పంపించారు స్టేషన్‌కి.

ఎన్ని రకాల ఇబ్బందులు పెడుతున్నాడో ఏంటో అని కొద్దిసేపు మీ దగ్గర విలవిల్లాడి పోదామని'' అని చెప్పి వెళ్లిపోతున్న భార్య తల మీద నిమురుతూ ''ఏంకాదు లేవోయ్, ఏం చేయను చెప్పు. 'పోగూడిన పట్టు చీరల మేళా' ఆవిష్కరణ నీకు తప్పదాయే. మా చైర్మన్ గారిని విమానం ఎక్కించి రావడం నాకు తప్పదాయే'' అన్నాడు ముక్కంటి.

''మా నాన్న ఇంటికొచ్చిందాక నాకు మనశ్శాంతి లేదండీ'' అంది హిమసుతం. ''సతతం ప్రశాంతం వందే హిమసుతం'' అన్నాడు ముక్కంటి. చిరునవ్వుతో చిలిపిగా చూసింది హిమసుతం.

***

ఆపసోపాలు పడుతూ- వచ్చీ రావడంతోనే వాష్‌బేసిన్ దగ్గరికెళ్లాడు డాక్టర్ మత్తేభం. చేతులు తుడుచుకుని మనవడు నందిని ఎత్తుకున్నాడు. ''అల్లుడు గారి కారు రైల్లో తెచ్చాను. మనవడి గారి రైలు కార్లో తెచ్చాను'' అన్నాడు మత్తేభం బొమ్మరైలు తీసి మనవడికిస్తూ. వెంటనే దాంతో ఆట మొదలు పెట్టాడు నంది.

''ఎవరన్నా ఊరునుంచి వస్తే కాళ్లు కడుక్కుంటారు. మీరేంటయ్యా చేతులు తడుపుతున్నారు'' అడిగాడు దండధరం అమాయకంగా.

''అవున్నాయనా మరి. నన్ను చేతులతో నడిపించి నంత పని చేశావు గదా'' అని అల్లుడు ముక్కంటి వైపు తిరిగి ''అల్లుడుగారూ! నేనిక్కడున్న నాలుగు రోజులూ మీ దండధరానికి మత్తింజక్షన్ ఇచ్చి పడుకోబెడతా ఏమనుకోకండే'' అన్నాడు మత్తేభం నవ్వుతూ.

''అమ్మో! నాకు సూదిమందంటే భయం'' అంటూ పరిగెత్తాడు దండధరం.

''డాక్టర్ మత్తేభం ప్రసిద్ధ ఎనస్థీషియాలజిస్ట్ ఆ కాయానికి మత్తిచ్చాడంటే దాని భాగాలు చూడడానికి ఇరవైమంది సర్జన్లొస్తారు'' అంది హిమసుతం నువ్వుతూ భర్తను చూస్తూ.

''వాడి లావుని వెక్కిరించడమేగా- ఆ మాటకొస్తే మీ నాన్నగారూ అంతే లావు'' అన్నాడు ముక్కంటి చిరుకోపాన్ని కప్పిపుచ్చుతూ.

''అందుకేనండీ బాబూ ప్లాట్‌ఫాం మీద అందరూ మమ్మల్ని చూసి నవ్వారు'' నవ్వుతూనే చెప్పాడు దండధరం.

''ఏమైంది నాన్నా'' గాభరాగా అడిగింది హిమ సుతం.

''మా సారు మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి తీసుకు రమ్మన్నారంటూ ఉన్నపళాన నన్నెత్తుకున్నాడు'' చెప్పాడు మత్తేభం.

''వాడికి వాడో కొండ పుష్పం అనుకున్నాడన్న మాట'' అంది హిమసుతం.

''ఎక్కడ వాడూ'' కేకపెట్టాడు ముక్కంటి.

''బయట కొత్తకారుని తుడుస్తున్నాడు నాన్నా'' చెప్పాడు నంది. ''అవును కారుని చూడాలిగదా'' అంటూ అందరూ ఇంటి బైటికి వచ్చారు.

***

కారుకి పూజ చేయించడానికి బయల్దేరారు. దండధరాన్ని కారులో రాకుండా చేయాలనుకుంది హిమసుతం. తన ఉద్దేశం భర్తతో చెప్పి చీవాట్లు తినడం ఇష్టం లేదు. అయినా ఏదో ఒక మార్గం ఆలోచిస్తూ- ''ఏమండీ- కొత్తకారు కదా నా డ్రైవింగ్ చూసి ఆనంద పడాలి కాబట్టి నాన్న వుండాలి. కారు రిజిష్టరయింది మీ పేరు మీద కాబట్టి మీరుండాలి. దండధరం లేకపోతే మీకు తోచదు కాబట్టి వాడుండాలి...'' అంటూ ఆగి ముక్కంటి వింటున్నాడో లేదో గమనించింది హిమసుతం.

''అనవసరంగా నీ నోరు నొప్పెందుకు గాని నేనూ దండధరం వెనక సీట్లో కూర్చుంటాం. నీ డ్రైవింగ్ నైపుణ్యాన్ని చూస్తూ మీ నాన్న నీ పక్కనే కూచుంటాడు. ఇంకేం మాట్లాడకు'' కోపంగా అన్నాడు ముక్కంటి.

''దండధరం పక్కన కూర్చోడానికి నాన్నకి నామోషీ ఏం లేదు. వెనక సీట్లో ఆ ఇద్దరూ ఇమడరని'' అంది హిమసుతం కొంచెం బుంగమూతితో. ''నేనెక్కడ కూర్చున్న నా మనవడు మాత్రం నా వొళ్లోనే'' అన్నాడు మత్తేభం నందిని ఎత్తి భుజం మీద ఎక్కించుకుంటూ.

''ఎందుకు నాన్నా మీరు ఇబ్బందిపడడం. దండధరం డిక్కీలో కూర్చుంటాడు''

''అహంభావం అధికస్య మానవత్వం నగోచరస్య'' అన్నాడు పళ్లు బిగపట్టి ముక్కంటి.

''నాన్నకు కోపం వస్తే ఏవో సంస్కృత శ్లోకాలు వినిపిస్తున్నాడీ మధ్య'' అన్నాడు నంది.

''అయ్యా! నేను డిక్కీలో కూర్చుంటా హాయిగా- నాకేం ఇబ్బందిలేదు'' అన్నాడు దండధరం వీళ్ల అలజడిని పసిగట్టి.

''అది బావుంది, ముందు వెనుక బరువులు సమాన మవుతాయి'' అన్నాడు మత్తేభం నవ్వుతూ, వేడిని చల్లార్చే ప్రయత్నంలో.

''కారులో పట్టాల్సిన వాళ్లు, ఇదిగో వీళ్లు అని కంపెనీకి మన కొలతలు పంపించివుంటే ప్రత్యేకంగా ఓ కారు తయారు చేయించి పెట్టేవారు కదా'' అంది హిమసుతం.

''భలే చెప్పారమ్మా'' అన్నాడు దండధరం.

''నీ మెప్పుకోలే నాక్కావాలి'' అంది హిమసుతం చికాగ్గా.

''థ్యాంక్స్ చెప్పొచ్చుగదమ్మా, ఎందుకంత చికాకు'' అన్నాడు నంది. నవ్వాడు ముక్కంటి.

ఏదో బందోబస్తు కారణంగా ట్రాఫిక్ జాం అయింది. యూటర్న్ తీసుకుని వెళ్లమని పోలీసులు చెప్పారు. అది కూడా వీలయ్యేట్లు లేదు. రోడ్ డివైడర్ మీదనుంచి కారుని దాటించడం ఒక్కటే మార్గం. అందరూ కారు దిగారు. చాలా ఒడుపుగా కారుని లేపి దాటించాడు దండధరం. దండధరం బలాన్ని మెచ్చుకోక పోగా ''కొత్తకారు ఏం గీతలు పడ్డాయో ఏమో'' అంది హిమసుతం.

వెనకవున్న రెండు మూడు కార్లకు కూడా సహాయ పడ్డాడు దండధరం.

''చాల్లే నీ సమాజసేవ వచ్చేయ్'' అని హిమసుతం దండధరాన్ని అనడంతో కారు కదిలింది. ''పూజ లేకుండానే ఇంటికొస్తున్నాం'' అన్నాడు నంది.

''నువ్వే లేకపోతే ఎపుడొచ్చేవాళ్లమో ఏంటో. కారుని అక్కడే వదిలేసి రావాల్సి వచ్చేదో ఏమో'' అంటూ దేవుడికోసం తీసుకున్న పూలదండ దండధరం మెడలో వేశాడు ముక్కంటి. అది హిమసుతానికి నచ్చలేదు.

''నాన్నా నువు కూడా ఆ దండలో దూరు. నీ శ్రమ కూడా వుందిగా'' అంది హిమసుతం.

''నేనలా చేయి వేశానంతే'' అన్నాడు మత్తేభం.

''అయితే ఆ చేయినే కొంచెం దూర్చు'' అంది.

''అందరూ అన్ని పనులు చేయలేరు'' అన్నాడు ముక్కంటి.

''కొందరు అందరి పనులు చేస్తుంటారు'' అన్నాడు మత్తేభం.

''ఎందరో ఎందరి పనుల్నో కాకుండా చేస్తుం టారు'' అంది హిమసుతం.

''ఎందెందరో ముందరే వుందురు. ఎందరుం దురు విందు ముందందే'' అన్నాడు దండధరం.

''ఏమిట్రా దానర్థం'' అడిగాడు ముక్కంటి.

''మీరేదో అన్నారని నేనేదో అన్నానయ్యా'' అన్నాడు దండధరం. అందరూ నవ్వారు.

***

ముక్కంటి ప్రశాంతచిత్తంతో వున్నాడని గమనిం చింది హిమసుతం.

''అసలు మీకీ దండధరం ఎక్కడ దొరికాడండీ'' అడిగింది.

''అవి నా పెళ్లికాని రోజులు... ఓ గదిలో వుండే వాణ్ణి... చేతిలో కెమెరా...''

''అంతొద్దు మూడుముక్కల్లో చెప్పండి చాలు'' అంది హిమసుతం.

''నేనోసారి ఓ నది ఒడ్డున ఫోటోలు తీస్తుంటే నీళ్లలో ఓ బండ కదిలివస్తున్నట్లనిపించింది. కానీ కాదు. వస్తున్నది దండధరం. ఎవరో కొట్టి పడేశారు. ఒడ్డుకు చేర్చా'' చెబుతున్నాడు ముక్కంటి. కళ్లు తుడుచుకుంది హిమసుతం.

''మా అమ్మాయి కళ్లలో నీళ్లేంటండీ'' అంటూ వచ్చాడు మత్తేభం.

''నాన్నేం శ్లోకం చెప్పలేదు తాతయ్యా'' అన్నాడు నంది.

జరిగిన సంగతి చెప్పాడు ముక్కంటి.

మత్తేభం ఆలోచనలు సుళ్లు తిరిగి వెనక్కు వెళ్లాయి.

''నన్నునుకొని కొట్టి నీళ్లలో పడేసింది దండధరా నన్నమాట'' అన్నాడు మత్తేభం.

అందరూ ఆశ్చర్య పోయారు.

''ఓ పేషెంట్ చచ్చిపోతే దానిక్కారణం నేనేనని అనుకుని, కొట్టడానికి వస్తున్నారని తెలిసి నది ఒడ్డున ఓ గుడిసెలో దాక్కున్నా... అంతే'' చెప్పాడు మత్తేభం.

''చంపడానికొచ్చినవాడైనా చావుబతుకుల్లో వుంటే బతికించడానికి చూసేవాళ్లు డాక్టర్లు. ఎవరో చెప్పండి వాళ్లు, ఇప్పుడే వెళ్లి బుద్ధి చెప్పొస్తా'' అని లేచాడు దండధరం.

అమాయకత్వంలో ఆ మానవత్వాన్ని చూసిన మత్తేభం- దండధరాన్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకునే ప్రయత్నం చేశాడు.

''అట్టే వుండండి, మీ ఫోటో తీసి పేపరు వాళ్లకి పంపించాలి'' అన్నాడు నంది.

''నీ అగ్గిపెట్టె కెమెరాలో ఈ భారీ ఆకారాలేం పడతాయిరా'' అన్నాడు మత్తేభం నవ్వుతూ.

''నాక్కావాల్సింది మీ పొట్టలు మాత్రమే'' అన్నాడు నంది.

''సరే మనవడి కోరిక తీర్చాలిగా'' అంటూ దండధరాన్ని దగ్గరికి తీసుకున్నాడు మత్తేభం.

''మీ లావులకి ఆలింగాసనం పనికిరాదు వది లేయండి'' అన్నాడు ముక్కంటి.

అందరూ నవ్వుకున్నారు.